క్లుప్తంగా

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 34 మంది గైర్హాజరు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో సోమవారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ తెలుగు పరీక్షకు 34 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, డిపార్టుమెంట్ అధికారి చలం తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం మండలాలకు చెందిన విద్యార్థులు 80 మంది పరీక్ష రాయాల్సి ఉంది. 46 మంది హాజరయ్యారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాలలో సోమవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించినట్టు ఆల్బనీ ఆంధ్రా అసోసియేషన్ ట్రస్టు మెంబర్ మోహన ఏకొళ్ల తెలిపారు. ఆల్బనీ ఆంధ్రా అసోసియేషన్ సహకారంతో టాటా క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు పీవీహేమంత్, శుక్రబ్రహ్మశ్రమం, భక్త కన్నప్ప కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొని, 120 మంది రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేసినట్టు తెలిపారు. కోఆర్డినేటర్ దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ-1గా కస్తూరయ్య


కస్తూరయ్యను సత్కరిస్తున్న జనార్దనరాజు

నారాయణవనం: మండల ఎంఈఓ-1గా కస్తూరయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన ప్రభాకర్‌రాజు గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కస్తూరయ్యను ఎంఈఓ-1గా ప్రభుత్వం నియమించింది. ఆయన్ని ఎంఈవో-2 జనార్దనరాజు, నేతలు అభినందించారు.

పిల్లపాళెంలో భూ వివాదం


సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

రేణిగుంట: మండలంలోని పిల్లపాళెంలో భూ వివాదం నెలకొంది. దీంతో సోమవారం రెవెన్యూ అధికారులు ఆ భూమిని సర్వే చేశారు. పిల్లపాళెంలోని సర్వే నంబర్ 323/2లోని 4.47 సెంట్ల గ్రామ కంఠం భూమిని కొందరు ఆక్రమించుకున్నరని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రతి సంవత్సరం గంగమ్మ జాతర సమయంలో బలి తిరుగుతున్నారని, ఆ స్థలాన్ని ప్రస్తుతం ఆక్రమించుకున్నారని స్థానికులు తెలిపారు. తహసీల్దార్ సురేష్ బాబు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకుని, వివాదాస్పద భూమిని సర్వే చేశారు. మంగళవారం కూడా సర్వే చేసి, సమస్యను పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శ్రీకాళహస్తి తాలుకా యూనిట్ ఆధ్వర్యంలో చలో విజయవాడకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాలుకా అధ్యక్షురాలు శాంతి దుర్గ, కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ ఏపీజీఈఏ 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉద్యోగులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, ఎంపీడీఓ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

వరదయ్యపాళెం: దేవాంగ కార్పొరేషన్‌ను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం వరదయ్యపాళెంలో విలేకరులతో మాట్లాడారు. దేవాంగులను ఓటు బ్యాంకుగానే వాడుకుని వదిలేసే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. అందుకు నిదర్శనం దేవాంగ కార్పొరేషన్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడమే అని తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసి అందులోనే దేవాంగులను డైరెక్టర్లుగా నియమించడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న దేవాంగులు తక్షణం ఆ పార్టీకి రాజీనామా చేసి దేవాంగ కార్పొరేషన్ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అంతేకాక పద్మశాలి కార్పొరేషన్‌లో డైరెక్టర్లుగా కొనసాగుతున్న దేవాంగులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

డీఈఓ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి: విద్యాశాఖ అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యాశాఖ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఉపాధ్యా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం వారు పట్టణంలో అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్రోపాధ్యా సంఘం తరఫున దేవేంద్ర పరిమిడి తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్‌తో తప్పని తిప్పలు

కూటమి ప్రభుత్వం సచివాలయాల నిర్వహణను గాలికి వదిలేసింది. కార్యాలయ నిర్వహణ, కంప్యూటర్ల సర్వీసింగ్, అవసరమైన మరమ్మతుకు నిధులు మంజూరు చేయలేదు. ఈ కారణంగా పలు సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకు చేరాయి. ప్రస్తుతం రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు వస్తున్న ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దీనికితోడు సర్వర్ డౌన్ కావడంతో సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది.

- రేషన్‌కార్డుల దరఖాస్తుల కోసం తిరుగుతున్న ప్రజలు
- పనిచేయని కంప్యూటర్లు
- వేధిస్తున్న సర్వర్ సమస్య
- కొన్నింటికి ఆప్షన్ లేకపోవడంతో అవస్థలు


రేషన్ కార్డుల దరఖాస్తుల కోసం సచివాలయాల వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు


సచివాలయంలో పనిచేయని కంప్యూటర్

వరదయ్యపాళెం: అర్హత ఉన్న వారు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. సర్వర్ సమస్యతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు.

గ్రామ సచివాలయాల వద్దే పడిగాపులు

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు గ్రామ సచివాలయాలకు వెళుతున్నారు. అక్కడ సర్వర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి అక్కడే నిరీక్షిస్తున్నా సర్వర్ సమస్య ఉందని, మళ్లీ రావాలని గ్రామ సచివాలయ సిబ్బంది చెబుతుండడంతో అవస్థలు పడుతున్నారు. అలాగే మార్పులు, చేర్పులకు ఈ-కేవైసీ చేయించడానికి అధికారులు ఎంత ప్రయత్నం చేస్తున్నా సర్వర్ తీసుకోవడం లేదని అంటున్నారు. రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ మొదలైనప్పటి నుంచి సర్వర్ సమస్యతో గ్రామీణుల ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సచివాలయం వద్దే వేచి చూస్తున్నా పనిజరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి స్వగ్రామాలకు వచ్చి దరఖాస్తులు చేసుకుంటున్న వారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. పొట్టకూటి కోసం నగరాలకు వలసబాట పట్టామని, రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు యత్నిస్తుంటే సర్వర్ పనిచేయడం లేదని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్య ఉందని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు.

దరఖాస్తు గడువు పొడిగించాలి

నూతన రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు మార్పులు, చేర్పులకు ఈ నెల 30వ తేదీ వరకూ ప్రభుత్వం గడువు కేటాయించింది. సర్వర్ సమస్య నెలకొనడంతో వచ్చే నెల వరకూ గడువు పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆప్షన్ లేక అవస్థలు

ఉమ్మడి కుటుంబంలో బియ్యం కార్డులో ఉండి వివాహమైన తర్వాత ఉమ్మడి కార్డు నుంచి విడదీయాలని అడిగితే ఆప్షన్ లేదని అధికారులు చెబుతున్నారని పలువురు వాపోతున్నారు. అలాగే కొందరు సింగిల్‌గా కార్డు పొందేందుకు దరఖాస్తు చేసుకోగా అందుకు ఆప్షన్ లేదని చెబుతున్నారు. ఇలా పూర్తి స్థాయిలో దరఖాస్తుకు అవకాశం కల్పించలేదని, దీంతో అనేక మంది అవస్థలు పడుతున్నారు.

సమస్య లేకుండా చూస్తాం



కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు, మార్పులు, చేర్పులు చేసుకోవడానికి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. సర్వర్ సమస్యతో ఇబ్బంది కలుగుతోంది. టెక్నికల్ సమస్య కారణంగా సమస్య వచ్చింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

–రాజశేఖర్, తహసీల్దార్, వరదయ్యపాళెం మండలం

4 నుంచి కావమ్మ, మారయ్య తిరునాళ్ల

శ్రీకాళహస్తి: పట్టణంలోని గాంధీవీధిలో ఉన్న కావమ్మ, మారయ్య ఆలయంలో జూన్ 4 నుంచి 6వ తేదీ వరకు తిరునాళ్ల జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తిరునాళ్లను జయప్రదం చేయాలని కోరారు.

రైల్వేగ్యారేజ్‌ను సందర్శించిన సీడబ్ల్యూఈ


సీడబ్ల్యూఈకి వినతిపత్రం అందజేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

రేణిగుంట: దక్షిణ మధ్య రైల్వే చీఫ్ వర్క్‌షాప్ ఇంజినీర్(సీడబ్ల్యూఈ) అమిత్ గుప్త సోమవారం రేణిగుంట సమీపంలోని రైల్వేగ్యారేజ్ రిపేర్ షాప్‌ను సందర్శించారు. సీఆర్‌ఎస్సీడబ్ల్యూఎం దేవ సహాయం ముందుగా ఆయనకు స్వాగతం పలికారు. సీఆర్‌ఎస్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మజ్దూర్ యూనియన్ నాయకులు ఆయన్ని కలసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ సదాశివరెడ్డి, కార్యదర్శి బాబు, ముని కుమార్, ముని రాధయ్య, ఎడ్రిపాల్, చంద్ర నాయక్, దిలీప్, గాండీవన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ


ఉదయ్‌శేఖర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే


శివ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
సింగమాలలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని నాయుడు బిల్డింగ్స్‌కు చెందిన కాకర్ల ఉదయ్‌శేఖర్ చౌదరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని, ఉదయ్‌శేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సాధన మున్నారాయల్, శ్రీవారి సురేష్, శరవణకుమార్, వేలూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: మండలంలోని సింగమాల గ్రామంలో ఇటీవల పెరుమాల్‌రెడ్డి బావమరది షణ్ముఖం శివ ఇటీవల మరణించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని శివ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సాధన మున్నా, శ్రీవారి సురేష్, శరవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతు


చేతిపంపు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని ఎండీ పుత్తూరు పంచాయతీ మిట్టఇళ్లు గ్రామంలో చేతిబోరు పాడైపోవడంతో సర్పంచ్ మోహనప్రియ దాని మరమ్మతుకు చొరవ తీసుకున్నారు. మండల అధికారులకు సమస్యను తెలియజేసి, సామగ్రిని తెప్పించి చేతిబోరు మరమ్మతులు చేయించారు.

ఇంటి ఆవరణలో పాము



రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని మంచి నీళ్ల గుంట సమీపంలోని ఇంటి ఆవరణలోకి సోమవారం పాము రావడంతో స్థానికులు భయాందోళన చెందా రు. మహిళ గట్టిగా కేకలు వేయడంతో స్థానిక యువకులు చేరుకుని పామును కొట్టి చంపారు. మంచినీళ్ల గుంటలో పిచ్చి ముక్కలు ఉండటంతో నిత్యం పాములు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉండడంతో విష పురుగుల కారణంగా చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు.

ఘనంగా ఆలయ మహాసంప్రోక్షణ


ఓబుళరాజు కండ్రిగలో ఆలయ కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న ఎంపీ గురుమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

- పూజల్లో ఎంపీ గురుమూర్తి, నూకతోటి రాజేష్

సత్యవేడు: మండలంలోని ఓబుళరాజు కండ్రి గ్రామంలో నిర్మించిన శ్రీ భూమి నీలాదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ మహాసంప్రోక్షణ(మహా కుంభాభిషేకం)ను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో తిరుపతి ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారికి బీరేంద్ర వర్మ, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి లడ్డు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, వేలూరు రాజేష్, కేవీ నిరంజన్ రెడ్డి, కే. సుశీల్ కుమార్ రెడ్డి, బెల్లు రమేష్, శ్రీధర్ రాజు, వంశీరెడ్డి, జయబాబు, హేమచంద్ర, పి.జయచంద్ర, ఎం.రామ్మూర్తి, కే.చిరంజీవి, జీ.శంకర్, ఎం.వెంకటయ్య, సోము, సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం నిత్యాన్నదాన సత్రం కమిటీ నియామకం

శ్రీకాళహస్తి: రాయలసీమ అగ్నివన్నెకుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి సన్నిధానంలో నూతనంగా నిర్మించబోయే నిత్యాన్నదాన సత్రం కమిటీని ప్రకటించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి నుంచి శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డిని నియమిస్తున్నట్లు రాయలసీమ రాష్ట్ర అగ్నివన్నెకుల క్షత్రియ అధ్యక్షుడు బలరామిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మల్లెంబాకం మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్రీశైలంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించబోయే నిత్యాన్నదానసత్రం కమిటీలో శ్రీకాళహస్తి నియోజవర్గం నుంచి తనని ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. శ్రీకాళహస్తి నియోజవర్గం నుంచి మప్పేటి నాదమునిరెడ్డి, ఏర్పేడు మండలం నుంచి జయశంకర్‌రెడ్డి, మునస్వామి రెడ్డి కూడా ఎంపిక అయ్యారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం


పద్మసరస్సులో స్నానమాచరిస్తున్న భక్తులు(ఇన్‌సెట్) చక్రస్నానం చేస్తున్న వేద పండితులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం ఉదయం పద్మసరస్సులో చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగిశాయి. వేకువజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం శ్రీవారి పల్లకీ సేవ చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామి చక్రతాళ్వార్‌తో కలిసి ఊరేగింపుగా పద్మసరస్సుకు చేరుకున్నారు. అక్కడ వేద పండితులు చక్రత్తాళ్వార్‌తో కలిసి దేవరులకు సుగంధ ద్రవ్యాలు, పాలు, పెరుగు, తేనే తదితర ద్రవ్యాలతో తిరుమంజనం చేశారు. 9.45 గంటలకు పద్మసరస్సులోని జలాలకు సంప్రోక్షణ చేసి చక్రస్నానం నిర్వహించారు. అదే సమయంలో భక్తులు సరస్సులో స్నానమాచరించారు. అనంతరం ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు విశ్వక్సేనుడితో క లిసి స్వామి, అమ్మవార్లు మాడవీధి ఉత్సవంలో పా ల్గొన్నారు. ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగిశా యి. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఇంజినీరింగ్ అధికారి గురుప్రసాద్, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు. రూరల్ సీఐ రవీంద్ర, ఎస్‌ఐ రాజశేఖర్ బందోబస్తు చేపట్టారు.

కమనీయం కల్యాణం


ప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రమైన బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. 10 గంటలకు ప్రసన్న వేంకటేశ్వస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను విశేషంగా అలంకరించి స్థానిక పద్మావతి సేవా మందిరంలో కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అగ్ని హోమం చేశారు. తదుపరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

లంచమిచ్చినా భూ సమస్య పరిష్కారం కాలేదు


ఫిర్యాదు చేస్తున్న గంగాధర్‌నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: అధికారులు అడిగినంత లంచం ఇచ్చినా భూసమస్యను పరిష్కరించలేదని మండలానికి చెందిన రైతు గంగాధర్‌నాయుడు వాపోయారు. ఆయన సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల ప్రజావేదికలో తహసీల్దారు శ్రీదేవికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ తాము కాటూరు గ్రామంలో 1971లో 7.25 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని తెలిపారు. అప్పటి నుంచి పంటలు సాగు చేసుకుంటున్నామని తెలిపారు. తనకు తెలియకుండా వెబ్‌ల్యాండ్‌లో 5 ఎకరాలను ముగ్గురు వ్యక్తుల పేరుతో నమోదు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని పలుమార్లు కోరినా ఫలితం లేదని వాపోయారు. కుప్పంలో సీఎం కార్యాలయంలో ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. కాటూరు వీఆర్వో రూ.6 వేలు లంచం తీసుకున్నాడని, అయినా తన సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన తహసీల్దారు శ్రీదేవి మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పుచ్చలపల్లికి నివాళి


రేణిగుంట: నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు


ఏర్పేడులో..

రేణిగుంట: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం రేణిగుంట సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ హరినాథ్ మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించిన స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు కమ్యూనిస్టు గాంధీగా పేరుపొందిన సుందరయ్యకు నివాళులర్పించడం మనందరి బాధ్యత అన్నారు. పేదల కోసం సమాజ సమానత్వ కోసం అంకితభావంతో పనిచేశారని, అలాంటి మహనీయుడి అడుగుజాడల్లో నేటి యువత నడవా లని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకటరమణ, చల్లా వెంకటయ్య, ఈశ్వరమ్మ, కుప్పస్వామి, దిలీప్‌బాషా, శివానందం, సత్య శ్రీ, సెల్వరాజు, నారాయణ, సుబ్రహ్మణ్యం, భారతి, పద్మ, సులోచన, అమ్ములు, జయరామ్ పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: ఏర్పేడులో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఏర్పేడు మండలంలో వివిధ గ్రామాల నుంచి 8 మంది సీపీఎం పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. వారితో నాయకులు ప్రమాణం చేయించారు. సీపీఎం నాయకులు రంగయ్య, కరీముల్లా, రాంబాబు, చంద్ర, ధర్మారెడ్డి, వెంకటేశ్వర్లు, చాంద్‌బాషా, వెంకట్రామయ్య పాల్గొన్నారు.

సంపదను దోచుకోవడానికి టీడీపీ నేతల ప్రణాళికలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలోని సంపదను దోచుకోవడానికి టీడీపీ నాయకులు చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతిబాబు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా నిప్పులు చెరిగారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వరదయ్యపాళెంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గానికి సంబంధం లేని చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతిబాబు ఏ హోదాలో ఇక్కడ పర్యటిస్తున్నారని నిలదీశారు. సత్యవేడులోని గ్రావెల్, మట్టిని స్వాహా చేయడానికే ప్రణాళికలు రచిస్తున్నారని దుయ్యబట్టారు. మీకు వైఎస్సార్‌సీపీని విమర్శించే అర్హత లేదన్నారు. ఎంతో నిబద్ధత కలిగిన రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌ను పరిజ్ఞానం లేని వ్యక్తిగా విమర్శించడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని దళితులపై దాడులు చేయిస్తోందని, సత్యవేడు నియోజకవర్గంలో దళితులపై దాడులు చేయడానికి చంద్రశేఖర్ నాయుడు ప్రయత్నిస్తున్నాడని, అందులో భాగంగానే సమన్వయకర్త రాజేష్‌ను కించపరుస్తూ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిలో ఎంతో వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గానికి శ్రీసిటీని తీసుకువచ్చి అనేక పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చేసిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందన్నారు. ఇకనైనా నియోజకవర్గంలో రాజకీయ అనిశ్చితిని తొలగించి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవుపలికారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ బందిల సురేష్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బాలసుబ్రమణ్యం రెడ్డి, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షుడు గిరిరెడ్డి, ఎబినేజర్ పాల్గొన్నారు.

గంగ జాతర చాటింపు

నాగలాపురం: మండలంలోని వినోబానగర్‌లో సోమవారం నుంచి గురువారం వరకు గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి చాటింపు వేశారు. సోమ వారం గెరిగను ఊరేగించారు.

దుండగులను వెంటనే అరెస్టు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘ నేతలు

ఏర్పేడు: తిరుపతిలో గత 15వ తేదీన దళిత విద్యార్థి జేమ్స్‌పై హత్యాయత్నం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ కోరారు. నిందితులు యశ్వంత్, రౌడీ షీటర్లు రూపేష్, చోటా బ్లేడ్ గ్యాంగ్, ఎలైట్ హోటల్ యజమాని పవన్ ను వెంటనే అరెస్టు చేయాలని తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కృష్ణ మాట్లాడుతూ దళిత విద్యార్థిపై దారుణానికి ఒడిగట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో మరో వ్యక్తి ఇలాంటి దుస్సాహసాలకు పాల్పడకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్ రావు, అంబేడ్కర్ భవన్ చైర్మన్ పరమశివన్, తాళ్లపాక దాము, నాయకులు కే.మురళి, గిరి, డాక్టర్ సుధాకర్, ధన శేఖర్, జయరాం, శ్రీను, ఇంద్రముని, రమేష్, చిరంజీవి పాల్గొన్నారు.